క్లుప్తంగా

విద్యార్థి సంఘం ప్రకటన సత్యదూరం

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాల క్యాంటిన్‌లో సిగరెట్లు, గుట్కాలు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ భారతీయ దళిత విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు యుగంధర్ ఇచ్చిన ప్రకటన సత్యదూరమని ప్రిన్సిపల్ సత్యనారాయణ స్పష్టం చేశారు. కళాశాలలో అసలు క్యాంటిన్ లేదని వెల్లడించారు. ఈ విషయాన్ని విద్యార్థి సంఘాలు అర్థం చేసుకోవాలని కోరారు.

ఘనంగా పుష్పాంజలి



వెంగమాంబకు అంజలి ఘటిస్తున్న అధికారులు

తిరుమల: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 208వ వర్ధంతిని పురస్కరించుకుని తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో శనివారం టీటీడీ అధికారులు ఘనంగా పుష్పాంజలి సమర్పించారు. ఈ సందర్భంగా వెంగమాంబ వంశీయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంగమాంబ ప్రాజెక్టు అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

రసాభాసగా మండల మీట్

- సభ్యుల అరుపులు.. కేకలు
- సంయమనంతో సభ నడిపించిన ఎంపీపీ

తిరుపతి రూరల్ : మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమైన సర్వసభ్య సమావేశం రసాభాసగా సాగింది. ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డిని వేదిక మీదకు పిలిచిన ఎంపీడీఓ రామచంద్ర, వైస్‌ఎంపీపీలను ఆహ్వానించక పోవడంతో మెజారిటీ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎంపీపీ జోక్యం చేసుకుని వైస్ ఎంపీపీ యశోదమ్మ, విడదల మాధవరెడ్డిని వేదికపైకి పిలవడంతో గొడవ కాసేపు సద్దుమణిగింది. సభకు తహసీల్దారు రామాంజులునాయక్ గైర్హాజరవడంతో మళ్లీ రగడ మొదలైంది. ఈ క్రమంలో సభ్యులు, అధికారులతో ఎంపీపీ సమన్వయం చేసుకుంటూ 20 శాఖలపై సమగ్రంగా సమీక్షించారు. ఎంపీటీసీ సభ్యులకు తగిన గౌరవం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సభ్యులు సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములను రిజిస్ట్రేషన్ చేయకుండా వేధించడంపై మండిపడ్డారు. మండలంలోని పలు ప్రాంతాల్లో శ్మశాన వాటికలకు స్థలం కేటాయించాలని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న ఎంపీపీ చంద్ర మోహన్ రెడ్డి

ధనుంజయులుకు నివాళి

తిరుపతి కల్చరల్ : బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు గాలి ధనుంజయులు నాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి బీజేపీ నేతలు ఘన నివాళులు అర్పించారు. శనివారం ఆర్ఎస్ మాడ వీధిలో గాలి ధనుంజయులు జయంతిని ఘనంగా నిర్వహించారు. గుండాల గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ గాలి ధనుంజయులు నాయుడు జీవితం బీజేపీ శ్రేణులకు ఆదర్శనీయమని తెలిపారు. నేతలు అన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, చెంగల్రాయులు, హేమంత్, సుబ్బయ్య, బ్రహ్మానందరెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, చంద్ర, వెంకటరత్నం పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

టౌన్‌బ్యాంక్‌లో ఆర్బీఐ నిబంధనల ఉల్లంఘన

తిరుపతి మంగళం : తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్(టౌన్‌బ్యాంక్)లో ఆర్బీఐ నిబంధనలను ఉల్లంఘిస్తూ సస్పెండ్‌లో ఉన్న బ్యాంక్ చీఫ్ మేనేజర్, మేనేజర్లను తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఎండీ శివకుమార్‌రెడ్డి ఇచ్చిన ఉత్తర్వులపై వివాదం నెలకొంది. త్రిమెన్ కమిటీ, బ్యాంక్ పాలకవర్గం ఆమోదం లేకుండా ఎండీ తీసుకున్న నిర్ణయంపై బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఎండీ శివకుమార్‌రెడ్డికి శనివారం సోకాజ్ నోటీస్ జారీ చేశారు. గత సంవత్సరం క్రితం బ్యాంక్ చీఫ్ మేనేజర్ వెంకటేష్‌రెడ్డి, మేనేజర్ వినోద్‌బాబు మార్టిగేజ్, వ్యాపార లోన్లను ఇష్టానుసారంగా మాఫీ చేసి, బ్యాంక్‌కు నష్టం కలిగించినట్లు ఈ ఏడాది మార్చి నెలలో జరిగిన పరిశీలనలో ఆర్బీఐ అధికారులు గుర్తించారు. దీనిపై జిల్లా సహకార అధికారి ఆదేశాల మేరకు వారిపై జరిపిన ప్రాథమిక విచారణలో ఆర్బీఐ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలింది. దాంతో వారిద్దరికి మెమోలు జారీ చేసి సస్పెండ్ చేశారు. అయితే వీరిద్దరిని ప్రస్తుత ఎండీ శివకుమార్‌రెడ్డి తిరిగి విధుల్లోకి తీసుకుంటూ ఇచ్చిన ఉత్తర్వులు వివాదానికి తెరలేపాయి. విచారణ కమిటీ నివేదికను పాలకవర్గానికి సమర్పించకుండా, సస్పెండ్‌ను రద్దు చేసి విధుల్లోకి తీసుకుంటూ ఉత్తర్వులు ఇవ్వడం ఎండీ అధికార దుర్వినియోగానికి పాల్పడడమేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సస్పెండ్ అయిన చీఫ్ మేనేజర్, మేనేజర్లు 17శాతం కంటే తక్కువ వడ్డీతో రుణాలు మాఫీ చేయకూడదన్న ఆర్బీఐ నిబంధనలు ఉన్నప్పటికీ వాటిని బేఖాతారు చేస్తూ 12, 14 శాతం వడ్డీతో సుమారు రూ. 6.92 లక్షల వరకు మాఫీ చేసి, బ్యాంక్‌కు నష్టం కలిగించినట్లు తెలుస్తోంది. ఈ నెపంతో ఇద్దరు మేనేజర్లను సస్పెండ్ చేశారు. సస్పెండైన వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలంటే బ్యాంక్ చైర్మన్, ఎండీ, చిత్తూరు జిల్లా అధికారితో త్రీమెన్ కమిటీ వేసి, ఆ తర్వాత ఆ కమిటీ నివేదికను పాలకవర్గం సమావేశంలో పెట్టి నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. అయితే అవేమి పాటించకుండా ఎండీ శివకుమార్‌రెడ్డి సస్పెండ్ ఎత్తివేస్తూ తీసుకున్న నిర్ణయంపై తిరుపతి కో-ఆపరేటివ్ బ్యాంక్ పాలకవర్గంతో పాటు ఖాతాదారులు భగ్గుమంటున్నారు.



ఎండీకి ఇచ్చిన నోటీసు

అవధాన దర్పణం 'బాల భాస్కరం'

తిరుపతి కల్చరల్ : అవధాన విద్యలోని పలు రకాల విన్యాసాలకు నిలయం అవధాన బాల భాస్కర పుస్తకమని ప్రవచనకర్త ఉప్పలదడియం భరత్ శర్మ తెలిపారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 'అవధాన బాలభాస్కరం' పుస్తకం రూపకల్పనకు ఏఐసీసీ సభ్యులు ప్రమీలమ్మ, శ్రీచక్ర హాస్పిటల్స్ అధినేత డాక్టర్ అర్చన ఈ పుస్తక ప్రచురణకు ఆర్థిక సహకారం అందించారని, ఆముదాల మురళి పుస్తకానికి ముందుమాట రచించారని వివరించారు.



పుస్తక పరిచయం చేస్తున్న నిర్వాహకులు

గ్లో గార్డెన్ ప్రారంభం



గార్డెన్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కమిషనర్

తిరుపతి తుడా : వినాయకసాగర్‌లో స్మార్ట్ సిటీ మిషన్ కింద ఏర్పాటు చేసిన గ్లో గార్డెన్‌ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ మౌర్య శనివారం రాత్రి ప్రారంభించారు. రూ. 1.25కోట్లతో గ్లో గార్డెన్ నిర్మించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. త్వరలోనే నాట్య వినాయక విగ్రహం ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

వేగంగా మార్గదర్శకుల ఎంపిక

నగరంలో బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల ఎంపికను వేగంగా పూర్తి చేయాలని కమిషనర్ మౌర్య ఆదేశించారు. పీ-4 సర్వే పురోగతిపై శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పారదర్శకంగా ఎంపిక చేపట్టాలని సూచించారు.

క్రమబద్ధీకరణకు అవకాశం

నగరంలోని అనధికార లేఅవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు అవకాశం కల్పించినట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ జీఓ 134 ద్వారా అనధికార లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణ పథకం-2020ని పొడిగించినట్లు వెల్లడించారు.

అ'పూర్వ' సమ్మేళనం



వర్సిటీ పరిపాలన భవనం ఎదుట పూర్వ విద్యార్థులు

తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ 1996- 2000 బ్యాచ్‌కు చెందిన 85 మంది పూర్వ విద్యార్థులు శనివారం వర్సిటీలో సమావేశమయ్యారు. మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆప్యాయంగా పలుకరించుకున్నారు. పూర్వ విద్యార్థులు ప్రొఫెసర్ దివాకర్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.హేమ , నీరజ, సుబ్బారెడ్డి, విభవర్ధన్, విశ్వనాథ్, అమరేష్, నవీన్, మీనా, సతీష్ కుమార్ పాల్గొన్నారు.

స్థాయి మరచి విమర్శలు

భాకరాపేట: టీడీపీ నేత శివ తన స్థాయి మరచి సహదేవరెడ్డిని విమర్శిస్తున్నాడని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు జి.మునిరెడ్డి మండిపడ్డారు. శనివారం వైఎస్సార్‌సీపీ చిన్నగొట్టిగల్లు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. సహదేవరెడ్డి ద్వారా పలు విధాలుగా లబ్ధి పొంది, ఇప్పుడు ఆయన మీదే విమర్శలు గుప్పించడం దారుణమన్నారు. అన్నం పెట్టిన వారిని తిడితే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

చంద్రగిరి: వెనుక నుంచి గుర్తుతెలియని లారీ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో ఓ విద్యార్థి మృతి చెందాడు. ఈ ఘటన తిరుపతి-మదనపల్లి జాతీయ రహదారి కేఎంఎం కళాశాల సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం.. ఏ.రంగంపేట సమీపంలోని ఓ కళాశాలలో బీ.టెక్ చివరి సంవత్సరం చదువుతున్న సాయితేజ(20) కళాశాల సమీపంలోని ఓ ప్రైవేటు హాస్టల్లో ఉంటూ చదువుకుంటున్నాడు. శనివారం రాత్రి సాయితేజ మరో ఇద్దరు విద్యార్థులతో కలసి ద్విచక్ర వాహనంపై తిరుపతి వైపు పయనమయ్యాడు. ఈ క్రమంలో కేఎంఎం కళాశాల వద్ద పీలేరు నుంచి తిరుపతికి వెళ్తున్న గుర్తు తెలియని లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయితేజకు తీవ్ర గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి 108 సిబ్బంది చేరుకోగా.. అప్పటికే సాయితేజ మృతి చెందినట్లు నిర్ధారించారు. మిగిలిన ఇద్దరూ క్షేమంగా బయటపడ్డారు. కేసు దర్యాప్తులో ఉంది.